క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



కంట్రోల్ రూమ్ నుంచి వివరాలు సేకరిస్తున్న తహసీల్దారు రాజు

రాజాం: తుపాను కారణంగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ఎక్కడా ఎటువంటి ప్రమాదం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఎస్.కె.రాజు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వరదల ప్రభావంపై వీఆర్‌వోలను ఆయన తన కార్యాలయంలో ఆదివారం కలిసి ఆరాతీశారు. వీఆర్‌వోలు, వీఆర్ఏలంతా ఎప్పటికప్పుడు గ్రామస్తులను అప్రమత్తం చేసి, నదీతీరాలకు, పొలాలకు వెళ్లకుండా చూడాలన్నారు. తుపాను సహాయక చర్యల నిమిత్తం తహసీల్దారు కార్యాలయం వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమను సంప్రదించాలని తహసీల్దారు తెలిపారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



501 వినాయక విగ్రహాలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు వద్ద మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అచ్యుతవల్లి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గాంధీబొమ్మ రోడ్డులో నివాసముంటున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి తన ఇంట్లో ఏర్పాటు చేసిన వినాయకుని బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. విభిన్న రూపాల్లోని 501 గణేశుని ప్రతిమలు చూపరులను అలరిస్తున్నాయి. వినాయక చవితి సందర్భంగా శనివారం వీటిని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

విజయవాడలో బొబ్బిలి పారిశుధ్య కార్మికుల సేవలు

బొబ్బిలి: విజయవాడలో వరద బాధిత ప్రాంతాల్లో బొబ్బిలి పారిశుధ్య సిబ్బంది సేవలందిస్తున్నారు. 20 మంది పారిశుధ్య కార్మికులు అక్కడి పారిశుధ్య పనులు చేసేందుకు వెళ్లారని, వారి పనుల పర్యవేక్షణకు ఇద్దరు సూపర్‌వైజర్లు కూడా వెళ్లారని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదివారం తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు



విద్యుత్ వైర్లకు ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలు తొలగిస్తున్న దృశ్యం

వంగర: భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలతో పలుచోట్ల విద్యుత్ వైర్లపై విరిగిపడిన చెట్లకొమ్మల కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు ఆదివారం చేపట్టారు. మండలంలోని శ్రీహరిపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, వీవీఆర్ పేట, రాజులగుమ్మడ తదితర గ్రామాల్లో కరెంట్ వైర్లపై పడిన చెట్లకొమ్మలను తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

బొబ్బిలి: ఏపీటీఎఫ్ ఆవిర్భవించి, 80 వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా స్థానిక ఇండోర్ స్టేడియంలో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ నాయకులు తెంటు సత్యంనాయుడు, సీహెచ్ రామారావు, కె.గోపాలకృష్ణనాయుడు, బి.సుధాకరరావులు ఈ పోటీలు ప్రారంభించగా, దత్తిరాజేరు, తెర్లాం, బాడంగి జట్లు వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి సెప్టెంబరు 14వ తేదీన జరిగే ఏపీటీఎఫ్ మహాసభలో బహుమతులు అందజేస్తామని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గంట సత్యనారాయణ తెలిపారు.

గుర్రపుడెక్క మళ్లీ మేటేసింది!



మడ్డువలస దగ్గరున్న గొర్లె శ్రీరాములునాయుడు రిజర్వాయరులోకి భారీగా గుర్రపుడెక్క మేట వేసింది. వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల్లోని సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి వస్తున్న వరదనీటితో ఇవి పెద్ద ఎత్తున ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నాయి. అధికారులు అప్రమత్తమై, పంట కాలువల ద్వారా వాటిని వెళ్లనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

– వంగర

జై బోలో గణేశ్ మహారాజ్ కీ..!

వాడవాడలా వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విభిన్న రూపాల్లోని గణేశుడి విగ్రహాలు, ప్రతిమలు మంటపాల్లో కొలువుదీరాయి. భక్తులంతా విఘ్నేశ్వరుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తాము చేసే ఏ కార్యంలోనూ విఘ్నాలు లేకుండా చూడాలని లంబోదరుడిని వేడుకున్నారు. జై గణేశ.. గణపతి బప్పా మోరియా.. జై బోలో గణేశ్ మహారాజ్ కీ.. అనే నినాదాలతో ఉత్సవ ప్రాంగణాలు మార్మోగాయి. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



బొబ్బిలి రూరల్: పక్కి గ్రామంలో గణనాథుడికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు



సంతకవిటి: వాసుదేవపట్నంలో పూజలందుకుంటున్న లంబోదరుడు



రాజాంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినాయక చవితి పూజల్లో సతీసమేతంగా పాల్గొన్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు



రామభద్రపురంలోని కూరాకుల వీధిలో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు



రేగిడి: సంకిలిలో పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు



రాజాం: మండల కేంద్రంలోని సారధి రోడ్డులో వినాయక చవితి పూజలు



తెర్లాం: మెండి వీధిలోని మంటపంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



రామభద్రపురం చొక్కాపు వీధిలో గణేశుడికి పూజలు చేస్తున్న భక్తులు



రేగిడి: మండల కేంద్రంలో వినాయకుడికి భక్తుల పూజలు



వంగర: బాగెంపేటలో వినాయక చవితి పూజల్లో పాల్గొన్న భక్తులు



రాజాం: తిరుమల కాంప్లెక్స్‌లో గణనాథుడికి పూజలు



రాజాం: బొద్దాంలో పూజలందుకుంటున్న గణేశుడు



రాజాం సిటీ: అమ్మవారికాలనీలో పూజలందుకుంటున్న గణనాథుడు

ఆ రోడ్డులో ప్రయాణం నరకమే..



బోల్తాపడిన లారీల మధ్య ప్రమాదకరంగా ఆటో వస్తున్న దృశ్యం

తెర్లాం: తెర్లాం-మెరకముడిదాం మండలాలను కలుపుతూ రాజాం-రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎం.ఆర్.అగ్రహారం దాటిన తర్వాత ఉత్తరావల్లి జంక్షన్ వరకు ఉన్న రోడ్డు మీదుగా ప్రయాణం చేయాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఆ రోడ్డు అంతా గోతులమయం కావడంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు నరకయాతన పడుతున్నారు. శనివారం ఉదయం అదే రోడ్డులో వెళ్తున్న రెండు లారీలు గోతులను తప్పించబోయి బోల్తాపడ్డాయి. దీంతో ఆ దారిలో ఇరువైపులా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో అటు వైపుగా ప్రయాణించే వారంతా అవస్థలు పడ్డారు. పారాది వంతెన మరమ్మతులకు గురికావడంతో లారీలన్నీ ఇదే రోడ్డు మీదుగా అధిక సంఖ్యలో వెళ్తుండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేత్రదానానికి ముందుకురావాలి

రాజాం సిటీ: నేత్రదానంతో మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చన్న మంచి విషయం అందరూ గుర్తెరగాలని ఏఎంసీ సేవా సంస్థ అధ్యక్షులు ఎ.వెంకటినాయుడు, పి.గౌరీశ్వరరావులు అన్నారు. స్థానిక పట్టణ పరిధిలోని అమ్మవారి కాలనీలో సంస్థ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మరణానంతరం కళ్లను దానం చేయాలని, ఇదే విషయంపై అందరినీ చైతన్యవంతులను చేయాలన్నారు. నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలన్నారు. కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్, బాబ్జి, శ్రీహరి, జగదీష్, వాసు, కార్తీక్, సతీష్, మోహన్, తారక్, మధు తదితరులు పాల్గొన్నారు.



నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎంసీ సేవా సంస్థ సభ్యులు

విరాళాల సేకరణ

రాజాం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని నరసింహనాయుడు కాలనీకి చెందిన చిన్నారులంతా విరాళాల సేకరణ ఆదివారం చేపట్టారు. కాలనీలోని ఇంటింటికీ వెళ్లి, బాధితుల కోసం ఆర్థికసాయం చేయాలని అర్థించారు. సమకూరిన ఈ మొత్తాన్ని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా కలెక్టరు కార్యాలయానికి అందించనున్నామని విద్యార్థులు తెలిపారు.

సీబీఎం స్కూలు విక్రయంపై తప్పుడు ప్రచారం

బొబ్బిలి: పట్టణంలోని సీబీఎం స్కూల్ విక్రయించేశారని తప్పుడు ప్రచారం చేయడం సరికాదని తాండ్రపాపారాయ విద్యాసంస్థల అధినేత తూముల భాస్కరరావు ఓ ప్రకటనలో ఆదివారం ఖండించారు. ఇదే పాఠశాలను కాకినాడకు చెందిన సీబీసీఎన్‌సీ నిర్వహిస్తోందని, విద్యార్థులు తక్కువగా ఉన్నందున పాఠశాల నిర్వహణకు అనుమతులు, గుర్తింపు ఇవ్వలేమని విద్యాశాఖ.. సంబంధిత యజమానులకు చెప్పడం జరిగిందన్నారు. దీంతో కోమటిపల్లిలోని విద్యాసంస్థల భవనాల్లో సీబీఎం స్కూల్ తరగతుల నిర్వహణ జరుగుతుందని, దానికి(ఆ భవనాలకు) బదులుగా సీబీఎం స్కూలును తనకు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. కోమటిపల్లిలో వారికి తాను రిజిస్ట్రేషన్ చేసిన భవనాల్లోనే అన్ని వసతులతో పట్టణ, పరిసర గ్రామాల విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం, మంచి పాఠశాలను ఏర్పాటు చేస్తారే తప్ప పాఠశాలను ఏకంగా మూసివేయరన్నారు. ఈ విషయం తెలియని వారే స్కూలు అమ్మేశారని ప్రచారం చేస్తున్నారన్నారు.

వరద బీభత్సం



బొబ్బిలి ఆర్ అండ్ బీ రోడ్డులోని పీహెచ్‌సీ వద్ద రోడ్డు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న మంగళగెడ్డ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తీవ్ర వాయుగుండంగా మారడంతో అంతటా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షం ఎడతెరిపిలేకుండా పడడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లు, వంతెనల మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చాలాచోట్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరికొన్ని చోట్ల కాలువలు, చెరువులకు గండ్లు పడడంతో సమీప పంటపొలాలు నీటమునిగాయి. మరోవైపు అధికారులు అప్రమత్తమై, ముంపు ప్రాంతాల్లో ఆదివారం పర్యటించి, నష్ట నివారణ చర్యలు చేపట్టారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



సంతకవిటి: సంతకవిటి నుంచి కొండగూడేం రోడ్డుపైకి చేరిన వరదనీరు



రేగిడి సమీపంలోని ఏకేఎల్ గెడ్డ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కల్యాణ చక్రవర్తి



రేగిడి: వరద నీటిలో నడిచి వెళ్తున్న రేగిడి గ్రామస్తులు



సంతకవిటి: సంతకవిటి-పొందూరు రోడ్డులో సిరిపురం వద్ద రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న రెల్లిగెడ్డ



సంతకవిటి: చింతలపేట వద్ద రాకపోకలు నిషేధిస్తూ తాడు కట్టిన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది



రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు చేరిన వరదనీరు



తెర్లాం: నందిగాంలో లక్షుంనాయుడు చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ, ఏఈ హరి



బొబ్బిలి రూరల్: కొత్తపెంట సమీపంలో అరటితోటలోకి చేరిన వరదను ప్రవహిస్తున్న తహసీల్దారు శ్రీను



సంతకవిటి: నారాయణపురం ఆనకట్టలో షట్టర్ల పైనుంచి కిందకు ప్రవహిస్తున్న నాగావళి నది నీరు



వంగర: కోనంగిపాడులో నేలకొరిగిన వరి పంట



రాజాం: నందబలగ సమీపంలో పంట పొలాల్లోకి చేరిన వర్షపునీరు



రాజాం: ఆగూరు-కంచరాం వంతెన మీదుగా ప్రవహిస్తున్న గెడ్డను పరిశీలిస్తున్న ఆర్‌ఐ విద్యాసాగర్



మెంటాడ: ఆంధ్ర రిజర్వాయరు వద్ద నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రమీలా గాంధీ



తెర్లాం: నందిగాం గ్రామంలోకి వరదనీరు వెళ్లకుండా శ్లాబు కల్వర్టు వద్ద చెత్తాచెదారాలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం



తెర్లాం: మంగళగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాజ్‌వేపై రాకపోకలు నిషేధిస్తూ తాడు కట్టిన రెవెన్యూ సిబ్బంది



బొబ్బిలి: భోజరాపురం వద్ద ఇన్‌ఫిల్ట్రేషన్ బావులు మునిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి